క్లుప్తంగా

గాలివీడులో 18.2 మి.మీ. వర్షపాతం



వెలిగల్లు జలాశయంలో పెరిగిన నీటిమట్టం

గాలివీడు : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గాలివీడులో 18.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ శ్రీ దుర్గ తెలిపారు. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వెలిగల్లు జలాశయంలోకి ఇన్ ఫ్లో పెద్దగా లేకపోవడంతో ప్రాజెక్ట్ నీటి మట్టం 2.7 టీఎంసీలుగా ఉంది. రానున్న రెండు మూడు రోజులు వర్షపాతం పెరిగితే మాత్రం స్వల్పంగా నీటి మట్టం పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్ట్ డీఈ శిరీష్ కుమార్ తెలిపారు.

కూటమి మోసాలు ప్రజల్లోకి..

ఒంటిమిట్ట : కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు పని చేస్తానని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల నియమితులైన ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పదవితో తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపునిచ్చే కార్యక్రమాలను విజయవంతం చేస్తానని తెలిపారు. అలానే పదవి వచ్చేలా సహకరించిన రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

గాలేరు - నగిరి ప్రాజెక్టును గాలికి వదిలేశారు



రాహుల్, రైతు నాయకుడు

చిట్వేలి : బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించి గాలేరు – నగిరి ప్రాజెక్టును గాలికి వదిలేశారని రైతు నాయకులు మలిశెట్టి రాహుల్ మండిపడ్డారు. మంగళవారం ఆయన చిట్వేలిలో విలేకరులతో మాట్లాడారు. గాలేరు – నగిరి ప్రాజెక్టు రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల తాగు, సాగునీరు, భూగర్భ జలాలకు జీవనాధారం అన్నారు. అలాంటి ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.2438.9 కోట్లు కేటాయించడం అన్యాయమన్నారు. ఇంత తక్కువ బడ్జెట్‌తో ఈ ప్రాజెక్టు పూర్తికావడం అసాధ్యమన్నారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఈ ప్రాజెక్టు పూర్తి కావడానికి కృషి చేయాలని లేకుంటే ఈతరం, భవిష్యత్తు తరాలకు ద్రోహం చేసిన వారమవుతామని తెలియజేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ

పుల్లంపేట : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను మంగళవారం ఎంపీడీఓ జయశ్రీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని వంట ఏజెన్సీని ఆదేశించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని వారు ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లీలా శ్రీహరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు వీఎస్ అచ్యుతానందన్



అచ్యుతానందన్‌కు నివాళి అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

రాజంపేట రూరల్ : శ్రమ జీవుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేసిన పోరాట యోధుడు వీఎస్ అచ్యుతానందన్ అని సీఐటీయూ నాయకులు కొనియాడారు. స్థానిక కార్యాలయం వద్ద మంగళవారం వీఎస్ అచ్యుతానందన్‌కు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎం వ్యవస్థాపకులలో అచ్యుతానందన్ ఒకరన్నారు. 7 పర్యాయాలు ఎమ్మెల్యేగా, 3 పర్యాయాలు ప్రతిపక్షనేతగా, ముఖ్యమంత్రిగా సేవలందించారని కొనియాడారు. కుల వివక్షత, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించినట్లు తెలియజేశారు. వ్యవసాయ సంఘం స్థాపించి రైతులకు అండగా నిలిచారని చెప్పారు.

పెండింగ్ ఇ-కేవైసీని పూర్తి చేయాలి

పెనగలూరు : మండలంలో పెండింగ్‌లో ఉన్న ఇ-కేవైసీని పూర్తి చేయాలని తహసీల్దార్ అమరేశ్వరీ అన్నారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఇ-కేవైసీ పెండింగ్‌లో ఉన్న జాబితాను మీమీ డీలర్లకు ఇవ్వడం జరిగిందని, త్వరితగతిన ఇ-కేవైసీ పూర్తి చేయాల్సి బాధ్యత డీలర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రామ్మోహన్, సీనియర్ అసిస్టెంట్ నవీన్, మండలంలోని డీలర్లు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి కరువై ఛిద్రమైన రోడ్లు



గుంతలలో వర్షపునీరు నిలవడంతో నరకంగా మారిన వడ్డపల్లె గ్రామీణ రోడ్డు



పొట్రెడ్డిగారిపల్లె రోడ్డుపై మడుగను తలపిస్తున్న నీరు

- గుంతమయంగా గ్రామీణ రహదారులు
- చిన్నపాటి వర్షాలకు నీళ్లు నిలిచి అవస్థలపాలు
- అధికారులు, పాలకులకు విన్నవించినా పట్టించుకోని వైనం
- ఆందోళనలో సంబేపల్లె మండల వాసులు

సంబేపల్లె : గ్రామీణ రోడ్లను పట్టించుకోకపోవడంతో దీనావస్థలో ఉన్నాయి. మండలంలోని రోడ్లు తేలికపాటి వర్షాలకే గుంతలమయమై రాకపోకలకు ఇక్కట్లు గురి చేస్తున్నాయి. మండల వ్యాప్తంగా గ్రామీణ రోడ్లపై పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో చిన్నపాటి గుంతలు కాస్త గొయ్యిలను తలపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం గుంతలు లేని రోడ్లను చేయడమే లక్ష్యమంటూ గతంలో ప్రగల్భాలు చెప్పినా క్షేత్రస్థాయిలో అది ఎక్కడా కనిపించడం లేదనే వాదన మండల ప్రజానీకం వ్యక్తం చేస్తోంది. సంబేపల్లె మండలంలోని దేవపట్ల నుంచి వంకవారిపల్లె, దిగవ రాజువారిపల్లె, హరిజనవాడ మీదుగా చిన్నబిడికి వరకు వెళ్లే మార్గాలలో కంకర పరిచి దాదాపు ఏడాది కావస్తున్నా నేటికీ రోడ్డు నిర్మాణంలో అడుగు కూడా ముందుకు పడటం లేదని అధికారులు, పాలకుల వ్యవహారం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రైతులు తమ పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించాలన్నా.. ధాన్యాన్ని ఇంటికి చేర్చాలన్నా నానా అవస్థలు పడక తప్పడంలేదు. అత్యవసర పనుల మీద ఈ మార్గాల్లో ప్రయాణించేందుకు ఆయా గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు. అలానే వడ్డపల్లె నుంచి నాయనవారిపల్లె వరకు నిత్యం ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ప్రయాణం సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు పూర్తిగా గుంతలు ఏర్పడి నీళ్లు నిలిచాయి. దీంతో వాహనాలు అదుపుతప్పి తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మా గ్రామాల రోడ్ల దుస్థితి ఎన్నడు బాగుపడతాయోనన్న ఆవేదనను ప్రజలు, వాహనదారులు వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల మరమ్మతు విషయమై అధికారులకు విన్నవిస్తున్నా స్పందనలేకపోవడంతో తీవ్ర నిరాశను వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల నిమిత్తం ఆస్పత్రులకు వెళ్లే గర్భిణులు, మహిళలు, వృద్ధుల పరిస్థితి వర్ణణాతీతమనే చెప్పాలి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తమ ఊర్లకు వెళ్లే రోడ్లను నిర్మించి తాము రోజూ పడుతున్న పాట్లు నుంచి తప్పించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

వీరబల్లి : సానిపాయి పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై గతంలో విచారణ చేసిన అధికారులు నివేదికను కూడా సమర్పించారు. కాగా ఆ నివేదికలో ఉన్న పలు అభ్యంతరాలపై స్థానికులు నేతి రమేష్, నేతి రామ్మోహన్ కలెక్టరేట్, సీఎంఓ ఆఫీస్, పంచాయతీ రాజ్ కమిషనర్ ఆఫీస్‌లలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై మదనపల్లి డివిజన్ డీఎల్‌పీఓ నాగరాజు, మండల తహసీల్దార్ ఖాజాబీ, వీరబల్లి మండల ఎంపీడీఓ జవహర్ బాబులను విచారించి నివేదిక అందించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం వారు పూర్వపు పంచాయతీ కార్యదర్శి బాలస్వామి, రాజశేఖర్ రెడ్డి, లంకా చంద్రుడు, రెహమాన్ సమక్షంలో రికార్డులను తనిఖీ చేశారు. నివేదికను రెండు రోజుల్లో కలెక్టర్‌కు అందజేస్తామని డీఎల్‌పీఓ నాగరాజు మీడియాకు తెలియజేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వీరబల్లి ఎస్ఐ నరసింహారెడ్డి, సిబ్బందితో బందోబస్తు కల్పించారు.

చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించు స్వామీ



టెంకాయలు కొడుతున్న మిథున్‌రెడ్డి అభిమానులు, పార్టీ కార్యకర్తలు

రైల్వేకోడూరు అర్బన్ : రెడ్‌బుక్ రాజ్యాంగం అమలులో భాగంగా కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అక్రమ అరెస్టుల పర్వంతో వైఎస్సార్‌సీపీ ఒరిగిపోయేది ఏమీలేదని అన్నమయ్య జిల్లా యూత్ వింగ్ అధ్యక్షులు వెలగచర్ల శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాఘవరాజపురం శివాలయంలో ఆయన ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగంలో ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన చంద్రబాబు నాయుడు, ప్రతిపక్ష నేతలను ఎలా వేధించాలో దారులు వెతుకుతోండటం దౌర్భాగ్యమన్నారు. అక్రమ కేసులతో వైఎస్సార్‌సీపీని అణచివేయాలని అనుకోవడం ఆయన మూర్ఖత్వమే అవుతుందన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని చెప్పారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించి, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరుతూ పరమేశ్వరుడికి 101 టెంకాయలు కొట్టారు.

గంబూసియా చేపలు విడుదల



రాయచోటి టౌన్ మురుగునీటి కుంటలో గంబూసియా చేపలను వదులుతున్న అధికారులు

రాయచోటి టౌన్ : గంబూసియా చేపలు దోమల వృద్ధిని అరికడుతుందని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం రాయచోటి ప్రాంతంలోని పలు మురుగునీటి కుంటలలో గంబూసియా చేపలను వదిలిపెట్టారు. ఈ క్రమంలో రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో, ఎస్ఎన్ కాలనీలో, పట్టణ ఆరోగ్య కేంద్రం సమీపంలో వీటిని వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంబూసియా చేపలు నీటిలోని దోమల లార్వాలతో పాటు దోమలను కూడా తినేస్తుందని తద్వారా దోమల వృద్ధి అరికట్టడంతో పాటు వాటి నుంచి వ్యాప్తి చెందే మలేరియా, టైఫాయిడ్, చికున్ గున్యా వంటి విషజ్వరాల వ్యాప్తి కాకుండా నివారిస్తుందన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారులు ప్రసాద్ యాదవ్, జయరామయ్య, శ్రీనివాసులు, ఎల్‌టీ శివ, ఏఎన్ఎం అనురాధ, ఆశ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట రూరల్ : గంబూసియా చేపలతో డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధులను నివారించవచ్చని వైద్యులు వికాస్, లక్ష్మీప్రసన్నలు తెలియజేశారు. పట్టణంలోని చక్రాలమడుగులో మంగళవారం గంబూసియా చేపలను జిల్లా మలేరియా అధికారుల ఆదేశాల మేరకు వదిలారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఎస్ఎస్ దాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాషా, హెల్త్ సూపర్‌వైజర్ శివకుమార్‌రాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు



ప్రజా వేదికలో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

ఓబులవారిపల్లె : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 2024 – 2025వ సంవత్సరాలకు సంబంధించి రూ. 8 కోట్లకు సంబంధించిన ఉపాధి పనులపై మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పీడీ పి.వెంకటరత్నం ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాజిక తనిఖీలో అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. ఇందులో చిన్నఓరంపాడు, ఓబులవారిపల్లి తక్కిన పంచాయతీలలో అక్రమాలు జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. వీటన్నింటిపై రెండు లక్షల రుపాయలు రికవరీ, లక్షల రూపాయల వరకు ఫైన్ వేయడం జరిగింది. ఈ సందర్భంగా పీడీ పి.వెంకటరత్నం మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ఏపీడీ ప్రతాప్, ఎంపీడీఓ మల్ రెడ్డి, ఈఓపీఆర్‌డీ రామ్మోహన్ రెడ్డి, ఏపీఓ ధనుంజయ, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని పూర్తి చేయాలి



బ్రిడ్జి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

రాయచోటి టౌన్ : రాయచోటి – సుండుపల్లె మార్గంలోని సిబ్యాల సమీపంలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గాజుల భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సిబ్యాల వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా గాజుల భాస్కర్ మాట్లాడుతూ రాయచోటి నుంచి సుండుపల్లి, పింఛా, రాయవరం వంటి ప్రాంతాలకు ప్రజలు పెద్ద ఎత్తున ఈ బ్రిడ్జి ద్వారా ప్రయాణం సాగిస్తున్నారని తెలిపారు. బ్రిడ్జి శిథిలావస్థ కారణంగా వాహనాలలో ప్రయాణించే వారు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ బ్రిడ్జి నిర్మాణంపై దృష్టి పెట్టి పనులు పూర్తి చేసి రాబోయే రోజుల్లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సల్మాన్, మన్సూర్‌ఆలీఖాన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పతాక దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

పుల్లంపేట : జాతీయ పతాక దినోత్సవం సందర్భంగా మంగళవారం పుల్లంపేట మండలం దళవాయిపల్లిలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో జాతీయ జెండాతో ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ భారత జాతీయ పతాక దినోత్సవాన్ని ప్రతి ఏడాది జూలై 22న జరుపుకుంటున్నామన్నారు. 1947లో స్వతంత్ర భారతదేశానికి మన రాష్ట్రానికి చెందిన పింగళి వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకాన్ని రాజ్యాంగ సభ అధికారికంగా ఆమోదించిన నేపథ్యంలో జూలై 22న జాతీయ పతాక దినోత్సవాన్ని జరుపుకొంటున్నట్టు వివరించారు.


నైతిక విలువలు పెంపొందించుకోవాలి

చిట్వేలి : విద్యార్థులు విద్యతోపాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని కరస్పాండెంట్ తిరుమల రెడ్డయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక శ్రీ సాయి వికాస్ ఉన్నత పాఠశాలలో 2024– 25 విద్యా సంవత్సరంలో మండలస్థాయిలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తల్లిదండ్రులు అభినందన సమావేశాన్ని నిర్వహించి అత్యధిక మార్కులు సాధించిన యు.జోశ్విత, కె.సిరి, ఎస్.మస్తాన్‌లను సత్కరించి మెమెంటోలు అందజేశారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

గాలివీడు : రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లు అల్లర్లు, అలజడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. చెడు నడత కలిగిన రౌడీషీటర్లపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. రౌడీ షీటర్లుగా నమోదైన ప్రతి ఒక్కరూ సంబంధిత స్టేషన్‌లలో సంతకాలు చేస్తూ ఉండాలన్నారు. బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో స్టేషన్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

శాకంబరీ దేవిగా..



అలంకరణలో నైనాదీశ్వరుడు

పెనగలూరు : మండల కేంద్రంలో ప్రాచీన నైనాదీశ్వరుని ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ జిలకర సుబ్బయ్య గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్యలు తెలిపారు. ఆషాడ మాసం సందర్భంగా ప్రతి ఏడాది శివాలయంలో శాకంబరీ పూజలు చేయడం ఆనవాయితీ. అందులో భాగంగా గ్రామస్తుల సహకారంతో వివిధ కూరగాయలతో నైనాదీశ్వర స్వామి, కామాక్షీ దేవిలను కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎంపీకి మద్దతుగా ఉంటాం



ఓబులవారిపల్లె : రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి తామంతా మద్దతుగా ఉంటామని రాయలసీమ బూత్ కమిటీ జిల్లా అధ్యక్షులు తల్లెం భరత్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రైల్వేకోడూరు వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి కుమార్ రెడ్డి, డాక్టర్ వెంకట సుబ్బయ్య, అన్నపూర్ణమ్మ, గల్లా శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ టార్గెట్‌గానే కూటమి కుట్రలు

- టీడీపీ నాయకుల కనుసన్నలో పోలీసు వ్యవస్థ
- వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

లక్కిరెడ్డిపల్లి : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని టార్గెట్ చేసుకునే కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆరోపించారు. మంగళవారం మండలంలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ కుమార్ రెడ్డి నివాసంలో ఆయన్ను పరామర్శించి, దుశ్శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్‌ను టార్గెట్ చేసుకొని రాష్ట్రమంతా వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అనుసరిస్తున్నారని చెప్పారు. ప్రజాక్షేత్రంలో జగన్‌కు ప్రజలు నీరాజనం పలుకుతున్నారని, అది చూసి ఓర్వలేక కూటమి ప్రభుత్వం జగన్‌పై తప్పుడు కేసులు పెట్టి ఇరికించాలని చూస్తోందన్నారు. రాష్ట్రంలో పోలీసులు కూటమి ప్రభుత్వానికి తొత్తులుగా మారి వ్యవస్థలపై నమ్మకం లేకుండా చేసుకుంటున్నారన్నారు. ఇందులో భాగంగానే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రెడ్డప్పగారి రమేష్‌కుమార్ రెడ్డిని అరెస్టు చేసి మదనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఉంచారన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన వాక్ స్వాతంత్ర్యానికి విరుద్ధంగా పోలీసులు నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మేల్కొని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు.

రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లే

సిద్దవటం : అనారోగ్యంగా ఉన్న రోగులకు రక్తదానం చేస్తే అది ప్రాణదానం చేసినట్లేనని సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ప్రకాష్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఇతరులు మొత్తం 20 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రిలో త్వరలో ఆపరేషన్‌లు చేయడం ప్రారంభిస్తున్నామన్నారు. ఆపరేషన్ చేయించుకునే వారికి రక్తం అవసరం ఉంటుందన్నారు. అందుకోసం ఇక్కడ బ్లడ్ డోనేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి బ్లడ్‌ను రిమ్స్ ఆసుపత్రికి అందజేస్తామన్నారు. ఆపరేషన్‌కు బ్లడ్ అవసరమైనప్పుడు రిమ్స్ నుంచి రక్తంను పొందుతామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సూచనలతో అధిక లాభాలు



వరి పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాజంపేట రూరల్ : అధికారుల సూచనలు పాటిస్తూ రైతులు లాభాలు పొందాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.వీరయ్య అన్నారు. మండల పరిధిలోని అప్పరాజుపేట, తాళ్లపాక గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఊటుకూరు శాస్త్రవేత్త డాక్టర్ పి.శ్రీవల్లి, రాజంపేట డివిజనల్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె.శివశంకర్, జిల్లా వనరుల కేంద్రం రామకృష్ణంరాజులతో కలిసి ఆయన పొలాలను సందర్శించారు. అక్కడ వరి పొలాలను సందర్శించి అందులో మురుగునీరు సరిగా పోకపోవటం వలన వేరు వ్యవస్థ కుళ్లి నల్లగా మారి ఆకు కొనలు, పిలకలు ఎండిపోవడం జరుగుతుందన్నారు. దీనిని నివారించిందేకు రైతులు పాటించాల్సిన పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ జి.నాగలక్ష్మి, గాయత్రితో పాటు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండండి

రాయచోటి టౌన్ : యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని అప్పుడే భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని శక్తి టీం సభ్యులు దశరథ్ అన్నారు. మంగళవారం రాయచోటి పాలిటెక్నిక్‌లో ఆ కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్, మత్తుకు, బాల్య వివాహాలు, సైబర్ క్రైం, పోక్సో చట్టం, ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించటం వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రేమ పేరుతో మోసాలు పెరిగిపోయాయని అన్నారు. అబ్బాయిలు, అమ్మాయితో ఎలా ప్రవర్తించాలనే విషయాలను వివరించారు. శక్తి యాప్ ఎలా పని చేస్తుందో అనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సుధాకర్, ఉపాధ్యాయులు, శక్తి టీం సభ్యురాలు కల్పన తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు

రాయచోటి టౌన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని అందులో భాగంగానే రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించారని ఏపీ ట్రికార్ మాజీ చైర్మన్ గుండా సురేంద్ర ఆరోపించారు. రాష్ట్రంలో నారా లోకేష్ నాయకత్వంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. ప్రశ్నించే గొంతుకలపై అక్రమంగా కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి మోసాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న మిథున్‌రెడ్డిని అరెస్టు చేసి జైలుకు పంపడం ద్వారా కింద స్థాయి కేడర్‌ను భయభ్రాంతులకు గురి చేయలనే కుట్రకు కూటమి ప్రభుత్వం కుతంత్రాలు పన్నుతోందన్నారు. కేవలం ఒక ఏడాదిలో ఐదు సంవత్సరాల వ్యతిరేకత రావడంతో ప్రజలను డైవర్షన్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దౌర్జన్యాలు, వేధింపులు, అక్రమ కేసులతో సీఎం చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు.

రెడ్‌బుక్ పాలనను ఎండగడతాం



కరిమిరెడ్డి జగదీష్‌రెడ్డి

చిన్నమండెం : వైఎస్సార్‌సీపీ నాయకులను వేధించడంలో ఉన్న శ్రద్ధ ప్రజలకు మంచి చేసే దానిలో లేదని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి కరమిరెడ్డి జగదీష్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్టును ఖండించారు. కూటమి ఆగడాలకు ఏ ఒక్క వైఎస్సార్‌సీపీ కార్యకర్త భయపడరని పేర్కొన్నారు. కూటమి కుట్రలు ప్రజలకు తెలియజేసి, ప్రజా క్షేత్రంలో రెడ్‌బుక్ పాలనను ఎండగడతామని స్పష్టం చేశారు. మూడు సార్లు ఎంపీగా గెలిచిన మిథున్‌రెడ్డి రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక అక్రమ కేసులను బనాయిస్తూ కక్షసాధింపు చర్యలకు దిగడం టీడీపీ నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. అక్రమ మద్యం కేసు నుంచి ఎంపీ మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటికి వస్తారని స్పష్టం చేశారు.

మంచి పేరు తెచ్చుకునేలా పని చేయాలి



ఏఎన్ఎంను సన్మానిస్తున్న వైద్యాధికారులు

పుల్లంపేట : ఏఎన్ఎంలు బాధ్యతతో తమ విధులు నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకోవాలని పుల్లంపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సానే శేఖర్, ఉమేష్ చంద్రలు అన్నారు. మంగళవారం బదిలీపై వెళ్లిన ఏఎన్ఎంలను వారు ఘనంగా సన్మానించారు. పుల్లంపేట నుంచి మల్లపు శివరాములమ్మ, ప్రసన్న కుమారి, కళావతి, రమాదేవి, శశికళ, నాగరాణి, సుభాషిని, మాధవి, హరోహరమ్మలు ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

రాయచోటి జగదాంబసెంటర్ : ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా ప్రధాన కార్యదర్శి లవకుమార్ పేర్కొన్నారు. మంగళవారం రాయచోటిలోని ఏఐఎస్ఏ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 39 ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు ఉన్నాయని అందులో దాదాపు 8714 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ సహాయంతో నడుస్తున్న ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో అమలు చేయాలని, ఉచిత పాఠ్యపుస్తకాలను అందించాలని కోరారు.

స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



సన్నటి గుంతను పూడ్చివేసిన అధికారులు

రాజంపేట టౌన్ : పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రోడ్డుకు మధ్యలో సన్నటి గుంత ఉండటం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో 'అప్రమత్తంగా లేకుంటే ఆసుపత్రికే..' అన్న శీర్షికతో ఈనెల 21వ తేదీ 'సాక్షి' దినపత్రికలో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. నిత్యం ప్రమాదాలు జరిగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ప్రమాదానికి కారణమవుతున్న సన్నటి గుంతను సిమెంటుతో సరిచేశారు. అలాగే ఆ మార్గంలో ఉన్న చిన్న, చిన్న గుంతలను సిమెంటుతో పూడ్చివేశారు. గత కొంతకాలంగా నిత్యం ప్రమాదాలు జరిగి అనేక మంది గాయపడుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని, అయితే 'సాక్షి' దినపత్రిక సమస్య తీవ్రతను తెలియజేస్తూ కథనాన్ని ప్రచురించడంతో అధికారులు స్పందించడం పట్ల ఆ ప్రాంత ప్రజలు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలియజేశారు.